124

# గ్రామ పునర్నిర్మాణం

## 1

ఇటువంటి విషయాలమీద ఎవరయినా వ్యాసాలు రాసినా వుపన్యాసా లిచ్చినా నమ్మకండి. నేను బి. ఎ. చదువుతుండగా ఈ "విలేజ్ రీకన్‌స్ట్రక్షన్" అనేమాట మొదటిసారి విన్నప్పు డ దేమిటో అర్థంకాలేదు. అది ఆరోజు హాస్టల్లో డిబేటుకు సబ్జక్టు. అయితేనేం? నలుగురూ అనుకుంటున్నదీ విని విషయం అర్థంచేసుకోవటమే కాక నేను కూడా మాట్లాడటానికి తయారయి ఒక పది నిమిషాలపాటు వూపిరి సలపకుండా ఉపన్యాసం యిచ్చి. కనీసం అరడజను పర్యాయములైనా "హియర్! హియర్!" అనిపించుకుని మరీ ఇవతలపడ్డా.

చెప్పొచ్చిందేమిటంటే వుపన్యసించటం అంత సులభం. లాయరు గట్టివాడైతే అన్యాయాన్ని న్యాయంకన్న న్యాయంగా కనపరచగలిగి నట్టుగానే కాస్త మాటకారి అయితే అడ్డమైనదాన్ని గురించీ మాట్లాడి మన జీవితం

యావత్తూ దానితోనే వుందని నిరూపించవచ్చు. ఈ గ్రామ పునర్నిర్మాణం అనేదాన్ని గురించే ఎవరైనా మాట్లాడు తుంటే ఒక్క పర్యాయం వినండి! గాంధీ మొదలయిన లీడర్లంతా కడమవ్యాపకాలన్నీ కట్టిపెట్టి గ్రామాలసంగతి ఎందుకు చూడరా అనిపిస్తుంది. తెలీ కడుగుతాను, ఇప్పుడు మన గ్రామాలకేం? పట్టణాల్లో వున్నట్టు మునిసిపల్ ఎన్ని కలు, ఖూనీలు లేవు. వెర్రిఖర్చు లేదు.

గ్రామాలకు బురదా, చవుడూ మొదలైన లోపాలు లేవనను కాని పల్లెటూరి వాళ్ళ చేత అవి లోపాలని ఒప్పిం చండి చూద్దాం! పోనీ పల్లెటూరివాళ్ళకు వాళ్ళ కష్ట సుఖాలే ఎరుక లేనంత దుస్థితి వచ్చిందని ఎవరన్నా దయ దలిచి "గ్రామ పునర్నిర్మాణ" నిర్వహణం పూనిరా అది పూర్తి అయేసరికి పొద్దుగూకి ప్రళయానికి వేళ్ళవుతుంది. వెధ వధి!—మా సూరాయివంటి మేధావికి పల్లెటూళ్ళో బాడ్మింటను క్లబ్బు ఏర్పాటు చేసేసరికి తల ప్రాణం తోకకొస్తే— క్షమించండి! పొరపాటున కథను చివర అందుకున్నాను.

## 2

తమ అనుజ్ఞ అయితే ఇప్పుడు కథ సరిగా మొదలు పెడతా.

నేను బి. ఎ. చదివే రోజుల్లో అనేక రహస్యాలు గ్రహించా. ఒక దాన్ని గురించి ఇంతకుముందే మనవిచేశా.

మరొక టేమిటంటే పల్లెటూరి పట్టులకు చెందిన సౌంద ర్యాన్ని గురించిన రహస్యం. పల్లెటూళ్ల ననుసరించుకుని సౌందర్యం వుంటూవున్నదన్న విషయం నాకు తట్టకపోవ టంలో నా తప్పేమీ లేదు. అది నాకళ్ళ ఎన్నడూ పళ్లేదు, బురద, చవుడు మొదలయినవంటూరా, అవైతే విరివిగానే చూశాను. ఎంత గుడ్డి కబోదైనా చూడకుండా వుండలేదు. ఈ సౌందర్యం ఏదైతే వుందో అది జొత్తిగా నా మీద శీత కన్నువేసి ఎన్నడూ నా కళ్లబడ్డ పాపాన్నైనా పోయింది కాదు. పల్లెటూరి వాళ్ళు బస్తీలను తిట్టి తమ గ్రామాలను గురించి మెచ్చుకుంటున్నప్పుడన్నా ఇందులో ఏదో వుందని పోలేదు నా బుద్ధికి. అదంతా పల్లెటూరివాళ్ల పక్షపాత బుద్ధి కింద తోసేసాను. కాని షేక్స్పియర్ మొదలయిన మహా కవుల నేం చెయ్యనూ? వాళ్లూ ఆ ముక్కే చెప్పుతుంటే ఇక నమ్మకపోవటం ఎలా? ఆ అనుభవం నేనుకూడా పొందు దామని అభిలాషకలిగి వేసవికాలపు శలవులకు సూరిగారి గ్రామం పోయినా.

సూరాయి నా రాకకు చాలా సంతోషించాడు. అది-నా రాక-తనకు ఒకవిధంగా చాలా సహాయకారి కాబోతున్న దన్నాడు. అదేమిటంటేని. నాకు సమాధానం చెప్పకుండా వాడు ఒక పెద్ద కొయ్యపెట్టిలోనించి నాలుగైదు పాత బాడ్మింటన్ బాటులు తీశాడు.

"పిటి గట్ యావత్తూ ఊడదీసి మళ్ళేసి మళ్ళీ అల్లాలి. సాయంత్రంలోపుగా రెండు బాటులైనా సిద్ధం చెయ్యాలి" అన్నాడు సూరి.

"చేసి?"

"సాయంత్రానికి ఆడుకోవచ్చు"

"ఎక్కడ?"

"అదంతా ఏర్పాటు చేశాలేరా! పదిహేను రోజుల్నించీ ప్రయత్నం చేస్తున్నా ఈ ఊరివాళ్ళచేత బాడ్మింటన్ ఆడించాలని. నా ఒక్కడివల్ల కాలేదు. కాస్త నువ్వు సహాయం చేస్తివా, ఈ ఊళ్ళో బాడ్మింటన్ టోర్నమెంటు పెట్టించకపోతే నా పేరు సూరాయి కాదు."

సూరాయి నా సహాయం కోరినందుకు సంతోషమయింది.

"నీ హంగంతా ఏది?"

"ఏం కావాలి?"

"నెట్"

"వుంది" వాడు పెట్టెలోనించి ఒక పాతనెట్ బయటికి తీశాడు.

"ఎక్కడిదిరా ఇది?"

"పిత్రార్జితం"

నా కప్పుడంతా జ్ఞాపకం వచ్చింది. మా మేనమామ బెజవాడలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో, ఇంట్లో బాడ్మింటనాడుతుండేవాడు స్నేహితులతో.

"ఏర్పాటంతా వున్నతరవాత ఎవరుపడితే వారే ఆడతారు–బాట్టుపెట్టి పిలవాలా ఏమిటి?"

"ఆడరాడరు! పల్లెటూరివాళ్లకు కొత్త విషయం వస్తే

భయం. ప్రతివాడికీ ఆటంతా వర్ణించాను. ఒక్కరోజు ఆడి చూడమన్నాను. ఊఁ హుఁ మసిద్దరం రెండురోజులపాటు ఆడి వీళ్ళకు భయం పోగొట్టాలి"

"ఒక్క క్షణం వుండరా సూరీ ! ఇది గ్రామ పునర్నిర్మాణం కిందికి వస్తుందంటావా?"

సూరాయి కాసేపు మొహం చిట్లించి "రానచ్చు నాకెన్నడూ తట్టలేదు. కాని నువ్వు చెప్పింతరవాత..." అన్నాడు.

"అయితే నీ ప్రయత్నం మాను" అన్నా.

సూరి నిర్ఘాంతపోయి "ఏం?" అన్నాడు.

"గ్రామ పునర్నిర్మాణం జరగదు. అది కృతజ్ఞతా రహితమైన పని. చివరకు నిన్ను వెలికూడా వేస్తారు. అనుభవంమీద చెబుతున్నాను విను."

"ఏమిటి నీ అనుభవం?"

"అలా అడుగు చెబుతాను. మొన్న డిసెంబరులో కాంతంగారి ఊరు వెళ్ళబోతూ బజారులో చౌకాకులూ, అవీ తగిలించుకునే కొయ్య పదార్ధాలుంటై చూశావు? —అది పట్టుకుపోయినా. కాంతం, బావా నన్ను చాలా మెచ్చుకుని దాన్ని మేకులుకొట్టి గోడకు పరిచి-పల్లెటూరి వేషాలు – ఒక బండెడు బట్టలు తగిలించారు. స్నానం చెయ్యబోతూ బావ, చౌకాకు దానికి తగిలించి తువాలు చుట్టుకొని బట్ట దాని మీద వెయ్యబోయ్యేటప్పటికి అదంతా బండెడు బట్టలతో సహా కదలి బావనెత్తిమీదికి అవతరించింది. పైన ఏం

చెప్పను ! ఆ రాత్రే అది చచ్చి దహనంపొందింది. నన్నటు వంటి వస్తువులు తీసుకు రావద్దని శాంతం శాసించటం ! దాన్నెందుకు తిడతావే నీ చవిటిగోడను తిట్టక అంటే, నీ సున్నపుగోడ లేడిచినట్లే వున్నయ్యి లెమ్మంది. కనక ఎందుకు తలపెడతావు గ్రామపునర్-"

"అందుచేత మనం వెంటనే బాట్లల్లటానికి వుపక్ర మిద్దాం, ఎక్కువ వ్యవధానంలేదు, సాయంత్రానికి బాట్లు సిద్ధం కావాలి" అన్నాడు సూరి చాటంత మొహంతో.

## 3

మీ కెప్పుడన్నా బాటు అల్లించుకోవలిసొస్తే నా సలహా తీసుకుని ఆరణాలు పారేసి చాతయిన వాళ్ళచేత చేయించుకోండి. మధ్యాహ్నం భోజనం కాగానే ఇద్దరం చెరోబాటూ తీసుకుని అల్లటానికి ఉపక్రమించాం. మొదటి నించి సూరి, నేను వెనకపడుతున్నానని సణుగుతునే వున్నాడు. ఎలాగోలా చేతులన్నీ చించుకుని అల్లటం పూర్తిచేస్తే, బాటు పరీక్షచేసి ముళ్లు తప్పు స్థలాల్లో ఉన్నయ్యనీ. బాటు వదు లయిందనీ, దాంతో ఆడేకన్న చక్క బాటుతో ఆడటం మంచిదనీ వ్యాఖ్యానం మొదలుపెట్టి కోప్పడేదాకా ఆగ లేదు.

"ఒరే సూరీ ! బంతులేవీ ? చూశావా, నన్ను నమ్ముకుంటే బాగుపడవు. బంతుల్లేకుండా ఎలా ఆడతాం ?"

"అన్నీ వున్నై. నీ తెలివితేటలమీద ఆధారపడలేదు నేనూ. వాటిసంగతి నాకు బాగా తెలుసు."

వాడి మాటల్లో నిష్ఠూరం నేను వినిపించుకో దలచ లేదు.

"బాగానే వుందికాని నా కీ ఆట బాగారాదే! నేను ఒకటి రెండుసార్లు ఆడాలని ప్రయత్నం చేస్తే బాటులోనించి బాలు దూరిపోవటం చూసి నా బాటుకు కంత లున్నాయని అందరూ కనుక్కున్నారు. నాతో ఏం పనవుతుంది?"

"నీతోనే అవుతుంది. చూస్తూవుండు"

అప్పటికింకా నాలుగైదు గడియల పొద్దుంది. నా నెత్తిన బంతీ, బాటులూ, నెట్టూ పడేసి తాను రెండు బొంగులూ, ఒక తవ్వుగోలా, టేపు తీసుకుని సూరి దారి తీశాడు. వూరిబయట చింతల మధ్య కోర్టుకు సరిపోయే చక్కని సమ ప్రదేశం వుంది. పది పదిహేను నిమిషాలకల్లా సూరి కోర్టు సిద్ధం చేశాడు. అవసరమైన గీతలూ అన్నీ గీసి గుంటలు తవ్వి, గుంజలు పాతాం.

మొత్తానికి మా సూరి చాతయిన మనిషి. అఖిల భారత గ్రామ పునర్నిర్మాణ మహాసభ ఒకటి ఏర్పాటుచేస్తే బాడ్మింటన్ బ్రాంచికి మా సూరాయి అద్భుతమైన అధ్యక్షు డవుతాడు. ఒక గంటసేపు ఆడి తట్టా బుట్టా నెత్తినేసుకుని ఇంటికి వస్తుంటే సూరి "నీ ఆట, మాచ్చికి అట్టే చెప్పకు గాని, నా పనికి బాగా ఉపకరిస్తుంది" అని, పైన చెప్పటం మరిచిపోయినాడు.

మర్నాడు మా ఆటకు ప్రేక్షకులు వచ్చారు! మా ఆట వాళ్ళకు చాలా సంతోష కారణమైనట్టు కనపడ్డది. దానికి కారణం ఆటలో నాకు గల నైపుణ్యమేనని నాకీనాటికీ కొద్దిగా అనుమానం వుండనేవుంది. నన్నుచూసి నవ్వితే నవ్వారుకాని మా వాడి ప్రయత్నం కొనసాగుతున్నందుకు సంతోషించాను.

ఈ విధంగా రెండు రోజులు గడిచింది. ప్రేక్షకులు వచ్చి చూసి సంతోషించినవాళ్లే కాని ఆడే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. సూరి ఎవ్వరినీ ఆడమని ఆహ్వానంచెయ్యనైనా లేదు. వాళ్లసలు ప్రేక్షకులనటానికూడా నాకంత మనస్కరించటంలేదు. వాళ్ళలో ఒక భాగం గొల్లపిల్లలూ, యింకో భాగం సంసార్లపిల్లలూ, కొద్దిమంది ఆడపిల్లలూ, ఒకటి రెండు గొడ్లూ, ఒక కుక్క-దానికి మా ఆటచూస్తే గౌరవం లేదు. వచ్చినట్టు వచ్చి ఏదో పనిమీద పోతూండేది - కొన్ని కోళ్లూ అవికూడా మధ్య మధ్య మా ఆట చూసి నవ్వుతూ పురుగులేరుకుంటూ అటూ ఇటూ షికారు చేస్తుండేవి.

నే నీ పరిస్థితులు సూరితో ముచ్చటించా.

"నువ్వు తొందరపడకు" అన్నాడు సూరి

"నేను వచ్చి ఆడమంటే చస్తేరారు, బెదిరిపోతారు. ఒకరిద్దరు తూగుతున్నారు. బహుశా రేపు ఎల్లుండి లోపల మన కోర్టు కిద్దరు ముగ్గురు మెంబర్లు రావచ్చు. అప్పుడు మనం శాస్త్రోక్తంగా యేర్పరుచుకుంటాం"

"వెధవ బాడ్మింట నాడటాని కింత భయమెందుకు, వెనకాడటం ఎందుకు!"

"మన భయాలు మనకు లేవా, నువ్వు నీ పెళ్లాంతో ఒక్కరోజు ఊరిబయటికి షికారు పోయిరా! పాపమా? తప్పా?"

"నవ్వరా?"

"ఇక్కడా అదే భయం."

మా ఉద్యమానికి మర్నాడు కాస్త జవం కలిగింది.

మామూలు ప్రకారం మే మిద్దరం ఆడుతున్నాం. నేను మాత్రం మామూలు ధోరంలో లేకపోవటంచేత రెట్టింపు ఉత్సాహంతో బంతులు తప్పుతున్నా. ఇంతలో అనుకోకుండా ప్రేక్షకుల్లోనించి ఒక సంసారి కుర్రవాడు కోర్టులో జొరబడి నా చేతులో బాటు లాక్కుని సూరితో "గావయ్యా! ఆడు, ఒకసెయ్య సూత్తానూ" అన్నాడు.మా సూరి నన్ను కోర్టులోనించి బయటికి పొమ్మని సంజ్ఞ చేశాడు.

ఆ రోజునించి వారంలోపల కోర్టులో ఎనిమిదిమంది మెంబర్లమైనాం. అందులో ముగ్గురం బ్రాహ్మలం. నేనూ, సూరీ కలుపుకుని, ఒకరోజున సూరి అందరిని కూర్చోబెట్టి చిన్న ఉపన్యాసం యిచ్చాడు. "ఈ ఆట పదిమందిఆడవచ్చు, ఇప్పుడెనిమిదిమంది మైనాం. మనకు మంచి బాట్లు లేవు, బంతులూ లేవు. నెలకు తలకో రొండణాలు వేసుకున్నా మంచి బంతి వస్తుంది. రూపాయో రూపాయిన్నరో పెడితే మంచి

బాటోస్తుంది. ఈ ఏర్పాటంతా చేస్తే మీ ఆట ఇంకా బాగుంటుంది. మనం ఒక మనిషిని ఎన్నుకుని వాడిచేతికి మన బేడా చందా యిస్తే వాడే అవసరమయిన సరుపా యాలుచేసి నెలాఖరుకు లెక్క చెప్తూంటాడు కాబట్టి మనలో ఒకణ్ని ఎన్నుకుందాం ఏమంటారు? నేను చెప్పిన దాని కిష్టమైనవాళ్లు చేతులెత్తండి."

ఒకరితరవాత ఒకరు అంతా చేతులెత్తారు. అందరి కన్న చివర చెయ్యెత్తిన వాణ్నిచూసి తరవాత నెలరోజుల దాకా నవ్వుకుంటునే వున్నారు. పల్లెటూళ్ళలో ఇటువంటివి ఊరికేపోవు.

"అంతవరకు బాగానేవుంది. ఈపనికి ఎవరుంటారు?"

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. చివరకొక పాతికేళ్ళ వాడు మొహం భయంకరంగా పెట్టుకులేచి "మా కదంతా తెలదండి. డబ్బంతా మీ చేతికే యిత్తాం. మీరేం చేసినా జరే!" నని కూర్చున్నాడు. అందరూ తల వూపారు భయంక రాకారం ఒకవిధమైన సిగ్గువల్లా, జంకువల్లా కలిగిన మార్పుని సూరి నాకు చెప్పినప్పు డాశ్చర్యం వేసింది.

కొద్దిరోజుల్లో మా కోర్టు కళ కళ లాడుతున్నది. కొత్తబాట్లు, కొత్త బంతులు, ప్రతిరోజూ ప్రేక్షకులు, పద ముగ్గురు మెంబర్లు. అయిదుగురు బ్రాహ్మణులు, మిగిలిన వారు శూద్రులు. మా వాడిరకో మీటింగు పెట్టి మరిద్దరిని

తను పెట్టే ఖర్చులకూ వాటికీ సాక్ష్యంగా వుండటానికి తీసుకుని క్లబ్బులో వాళ్ళకూడా పదవి యిచ్చాడు.

కోర్టుకు పేరువచ్చింది కాని కీర్తిరాలేదు. ఊళ్ళో ముఖ్యులంతా మా కోర్టును లక్ష్యంచేసినట్టు కనపడలేదు. కాని ప్రతిరోజూ సాయంత్రంవేళ అరుగులమీద జరిగే మీటింగుల్లో మా కోర్టును గురించి చర్చ వస్తున్నదని మాకు తెలుసు.

## 4

ఒకరోజు రాత్రి నేనూ, సూరాయ్ భోంచేసి చల్ల గాలికి అరుగుమీద చేరాం. కొంచం సేపటికి ముగ్గురు నలుగురు బ్రాహ్మణ యువకులు వీధివెంట వచ్చి మేంకూర్చున్న అరుగులమీద తిష్టవేశారు. ఎందుకంటే ఊరికేనన్నారు. మేం వాళ్ళని లక్ష్యం చెయ్యకుండా మా ధోరణిలోనే వుండగా ఆ సమూహంలో గుస గుసలు బయల్దేరినై. ఆ గుస గుసలు పెద్దవై నలుగురూ ఒక్కసారి బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టి ఎవరి గొంతులు వారికే వినపడక అంతా ఒక్కసారి చాలించారు. అంతా ఒక్కసారి నిశ్శబ్దం.

"ఏమిటీ గలభా!" అన్నాడు సూరి.

వాళ్లు తెలియచేసిన సంగతిది. ఊళ్ళో 'కొందరు'మా

బాడ్మింటన్ కోర్టులో చేరాలనే ఉద్దేశంతో వున్నారట. కాని ప్రస్తుతం అంతా శూద్రమేళంగా వుందని అనుమానిస్తున్నారట. అది బ్రాహ్మణ సంఘం అయ్యే యేర్పాటు చేస్తే-

రే వుదయం చెబుతానని సూరి వాళ్లను పంపేశాడు.

"మన కిక్కడ బ్రాహ్మణ, బ్రాహ్మణేతర సమస్య కూడా ఎక్కువైనట్టుంది ఏం చేస్తావు? వున్న శూద్ర పిల్లల్ని తీసేస్తావా?"

"దీన్లో శూద్రులున్నారన్న ఏడుపుకంటె వాళ్లు పదవుల్లో వున్నారని ఏడుపు— నిన్న ఇద్దర్ని ఎన్నుకున్నాం కాదూ? బ్రాహ్మడు సంభావనకోసం పరిగెత్తుతాడు. ఉద్యోగం కోసం పరిగెత్తుతాడు. ఆంధ్రుల్లో వెయ్యి, రెండువేల మైళ్లదూరంవెళ్ళి అక్కడ కీర్తి సంపాదించినవారు లేకపోలేదు. అంతా బ్రాహ్మణులే." ఇంకా కొంతకాలంవరకూ ఈ రాయబారాలు రాకపోతే మన క్లబ్బులో మరి నాలుగు గౌరవపదవులు సృష్టిద్దామని చూస్తున్నాను.

"అయితే బ్రాహ్మలు కోర్టులో ప్రవేశించి శూద్రులను వెళ్లగొట్టటం అన్యాయంకాదా?"

"అప్పుడు కాని గౌరవం రాదు కోర్టుకు. ఈ శూద్రుల కూడా బ్రాహ్మణులు కోర్టులోచేరి తమను, వున్న స్థానాల నించి వెళ్లగొట్టిం తరవాత కోర్టునుచూస్తే గౌరవం హెచ్చుతుంది. అదీకాక ఇంకొకటి చూడు, కూలిదొరక్క, ముష్టి

దొరక్క దొంగతనానికి తెగబడి జైలుకు పోయినవాడు అన్యాయమనుకుంటాడా? కర్మమనుకుంటాడా? ఈ బ్రాహ్మణులు కోర్టులో చేరినతరవాత శూద్రులకు పూపిరాడదు. వాళ్లు బహుశా ఇంకో కోర్టు లేవదీస్తారు."

సూరిచెప్పిన ప్రతి అక్షరం నిజమైంది. నే నా వూరు వదలి వచ్చేటప్పటికి రెండు కోర్టులూ విజృంభిస్తున్నై. కొంత మంది బాగా ఆడుతున్నారు.

## 5

తొమ్మిది నెల్ల కాలం గడిచింది. తిరిగి ఏప్రిల్ మొదట్లో సూరి మా యింటి కొచ్చాడు. తతిమ్మా విషయాలతోపాటు క్లబ్బును గురించికూడా అడిగాను

అంతా వింటే సూరాయికి క్లబ్బులో ఎక్కువ గౌరవం వున్నట్టు తోచలేదు. మొదట్లో ఇతరులకు దేన్ని గురించీ ఏమీ తెలీకపోవటంచేత సూరికి నిరంకుశాధికారం యిచ్చారుట. కాని తరవాత వాడి ఇష్టంవచ్చినట్టు చేస్తున్నాడనీ, ఇక తను చాలించుకుని మరొకడికా పదవి ఇవ్వాలనీ కడంవాళ్లకు తట్టింది. సూరాయికి ఒళ్లుమండి క్లబ్బు తనది, తన యిష్టం అన్నాడు. కొన్నాళ్లు క్లబ్బు పాడుపెట్టారు. సూరాయి అరుగులమీద వుపన్యాసా లిచ్చాడు. శూద్రు

లంతా రౌండ్ కోర్టు అద్భుతంగా పని చేయిస్తున్నారు. బ్రాహ్మణు లెప్పుడూ యింతేనని తిరిగి కోర్టు పని చెయ్యటం మొదలుపెట్టింది. జరిగిపోయింది. ఇప్పుడు సూరి ఇంకో ఎత్తు వేశాట్ట. తలకో రూపాయి చందా వేసుకుని మూడు కప్పులు చేయించి పందాలు పెడదామన్నాడు. కొంతకాలం నించి సూరాయి ఏదిచెప్పినా వద్దనటం మొదలుపెట్టారు కొందరు మెంబర్లు. ఇప్పుడూ ఆ మాటే అన్నారు. అయితే నేను సొంతంగా టోర్నమెంటు పెడతాను, ఆడదలుచుకున్న వాళ్లు ఫలాని రోజు లోపల రుసుము చెల్లించి అప్లికేషను రిజిస్టరు చేయించుకో మన్నాడు. క్లబ్బు మెంబర్ల మాట చెప్పటానికి వీలులేదు. మాకే పందాలు వద్దన్నారు.

"యివాళ కప్పుల కార్డరిచ్చాను. పాపం రౌండ్ కోర్టువాళ్ళంతా చెల్లించారు. సుమారు రిరవై రూపాయలు వసూలైనాయి. మన కోర్టువాడు ఒక్కడివ్వలేదు. రేపు సాయంత్రంలోపల ఇవ్వకపోతే ఎల్లుండి మా చెస్‌లోకి రారు."

"నువ్వంత స్ట్రిక్టుగా వుండకపోతే యేంరా! చేతి డబ్బెంత తగులుతుంది!"

"ఏమీ తగల్దు. అసలు కప్పులు మూడూ ఒక పది రూపాయలతో వచ్చేవే. నే నొక వుద్దేశంతో మూడూ, ముప్ఫై రూపాయల కార్డరు చేశా అసలెందుకు? రేపు సాయంత్రం లోపల యింకో ఇరవైరూపాయలు కాలవ్వూ?" అన్నాడు.

సాయంకాలానికి కష్నలు సిద్ధమైనై. రాత్రికి ఇద్దరం సూరిగా రూరు చేరాం. తెల్లవారగానే వూరంతా కప్పలు వచ్చిన వార్త వ్యాపించింది. జనం గుంపులుగావచ్చి కప్పలు చూసి పోయినారు. వచ్చిన ప్రతివాడితో మొదటి కోర్టువాళ్లు మూర్ఛించటాన్ని గురించి చెప్పాడు సూరి. అందరూ సూరికి ప్రతి కక్షులే కాని కప్పలు చూడగానే ప్రతివాడి హృదయంలో కామం ప్రవేశించింది. కొందరు పెద్దలు సూరితో ఈ విషయం దీర్ఘంగా చర్చించి "మెంబర్లతో మేం చెప్పి వొప్పిస్తాం. పందాలు యింకా రెండు రోజు లవతలపెట్టి కొంత గడు విప్పించ"మని కోరారు. "అదెప్పటికీ జరగదు. మూడు కప్పలూ రెండో కోర్టుకు పోవలిసిందే" నన్నాడు.

నేను సూరి ప్రయత్నం నిష్ఫల మౌతున్నదని రూఢి పరుచుకున్నాను. ఈ పందాలతో సూరికి నష్టం వస్తుందని కాదు, పందాలు రెండు కోర్టు వాళ్లతో జరగవని కాదు. మొదటి కోర్టువాళ్లుకూడా పందాలులో పాలుతీసుకోకపోతే సూరి గ్రామ పునర్నిర్మాణం చెయ్యలేక పోయినట్లే. వాడి కది మాడు మీద దెబ్బ. కాని సూరెందుకు దెబ్బతింటాడు! ఆరో జయిదుగంటలకు సన్నగా, పొడుగ్గా వున్న కుర్రవాడు పోతూ పోతూ వచ్చినట్టు లోపలికొచ్చాడు. కప్పలు చూశాడు. బొడ్డులోనించి రెండు రూపాయలు తీసి తన్ను సింగిల్సకు వెయ్యమన్నాడు. పోతూ పోతూ ఈ విషయం

మర్నాటిదాకా ఎవరితో చెప్పొద్దన్నాడు. కాబట్టి సూరాయి వచ్చిన ప్రతి వాడితో చెప్పాడు. అరగంట తరవాత దృశ్యం చూసితీరాలి. సూరి డబ్బు రెండు చేతుల్తో వసూలు చేశాడంటే నమ్మండి ఇక కోర్టు మెంబర్ల విషయమా ! వాళ్లకు ఒకర్నొకరు తిట్టుకోటానికి టైము లేదు. ఎప్పుడు సూరి "యిక తీసుకోను" అంటాడో అనేభయం.

"టోర్నమెంటు" జయప్రదంగా జరిగింది.